క్లుప్తంగా

ఈరన్న స్వామికి అభిషేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తులను దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు మొక్కుబడిలో భాగంగా ఆలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి పూజలు చేశారు.

కోసిగిలో మోస్తరు వర్షం



రైల్వే గేటు సమీపంలో రోడ్డుపై ఏర్పడిన మడుగు

కోసిగి: మండలంలో మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు తుపాను మాదిరిగా చిరుజల్లులు కురిశాయి. వర్షాల రాకతో కోసిగిలోని ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. ప్రధాన రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్, రైల్వే గేటు సమీపం, సబ్ రిజిస్ట్రార్, పంచాయతీ కార్యాలయం ముందు భాగంలో రోడ్డుపైనే వర్షపు నీరు నిల్వ చేరింది. ప్రయాణికులు, వాహనదారుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్లపై పడిన గుంతలను పూడ్చి వర్షపు నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



రూ.50 వేల విరాళం అందజేస్తున్న ఈరన్న

ఆదోని టౌన్: ఆదోని పట్టణం శుక్రవారపేటలో వెలసిన జమ్మి మరలి రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి కోసం స్థానికుడు అంబల్‌డాగీ ఈరన్న తన ధర్మపత్ని సరోజమ్మ జ్ఞాపకార్థం రూ.50 వేల నగదును సోమవారం ఆలయ కమిటీ నిర్వాహకులకు విరాళం అందించారు. దేవాలయం అభివృద్ధికి తనవంతుగా సహాయం చేయడం సంతోషంగా ఉందని ఈరన్న చెప్పారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానికులు పాల్గొన్నారు.

పోలీసు వలయంలో బొమ్మిరెడ్డిపల్లె



బొమ్మిరెడ్డిపల్లెలో బందోబస్తుకు వచ్చిన పోలీసులు

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లెలో ముందు జాగ్రత్తగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివారం జరిగిన ఘర్షణలో మృతి చెందిన గిరినాథ్‌చౌదరి అంత్యక్రియలు సోమవారం ముగిశాయి. మృతదేహానికి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, పలువురు నేతలు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, తిక్కారెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఇంటెలిజెన్స్ ఎస్పీ లతామాధురి, ఆదోని, కర్నూలు దిశ, పత్తికొండ డీఎస్పీలు శివనారాయణస్వామి, బాబుప్రసాద్, శ్రీనివాసరెడ్డి, 11 మంది సీఐలు, పలువురు ఎస్‌ఐలు, కేంద్ర బలగాలతో బందోబస్తు నిర్వహిస్తున్నారు. గిరినాథ్‌చౌదరి హత్యకు సంబంధించి మృతుని తండ్రి రామాంజినేయులు ఫిర్యాదు మేరకు రమేష్, రామకృష్ణతో పాటు మరో 14 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సీఐ, ఎస్‌ఐలు వీఆర్‌కు..

బొమ్మిరెడ్డిపల్లెలో జరిగిన హత్య నేపథ్యంలో సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డిని రాత్రి రాత్రే ఉన్నతాధికారులు వీఆర్‌కు పంపుతూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే కర్నూలు ఫోర్త్ టౌన్‌లో ఉన్న సునీల్‌కుమార్‌ను ఎస్‌ఐగా, కర్నూలు సీసీఎస్‌లో ఉన్న బీవీ మధుసూదన్‌రావును సీఐ నియమించగా వీరు తెల్లవారుజామునే బాధ్యతలు స్వీకరించారు.

ప్రమాదకరంగా కల్వర్టు

హొళగుంద: మండలకేంద్రం నుంచి బాపురం, గూళ్యంకు వెళ్లే మార్గంలో వంక వద్ద కల్వర్టు కోతకు గురై ప్రమాదకరంగా మారడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినప్పటికీ కల్వర్టు వద్ద రోడ్డు కోతకు గురికావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కల్వర్టు కుంగిపోయింది. దీంతో అటుగా ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కల్వర్టు వద్ద రోడ్డును బాగుచేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

పశుసంపద జర జాగ్రత్త



గొర్రెలకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు



ఎద్దుకు టీకా వేస్తున్న సిబ్బంది

ఆదోని సెంట్రల్: వర్షాకాలం మొదలైంది. వర్షాలు పడే సమయంలో పశువులకు వివిధ రకాల వ్యాధులు ప్రబలుతాయి. వాటిపై పాడిరైతులు, గొర్రెల పెంపకందారులు ఆందోళన చెందకుండా అప్రమత్తంగా ఉండాలి. మూగజీవాలకు వచ్చే సాధారణ వ్యాధులే అయినప్పటికీ సంరక్షణ చర్యలు తీసుకోకపోతే పశు సంపదను నష్టపోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా వర్షాకాలంలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు, గాలికుంటు వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఇవి జూన్ నుంచి సెప్టెంబర్ మాసం వరకు తొలకరి సమయంలో అధికంగా వ్యాప్తి చెందుతుంటాయి. ఈ వ్యాధులు సోకితే పాల దిగుబడి తగ్గడంతో పాటు పశువులు మృతి చెందే ప్రమాదం ఉంటుంది. దీంతో పాడి రైతు నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కావున పాడి రైతులు పశు వ్యాధుల పట్ల తగు జాగ్రతలు తీసుకుని అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆదోని డివిజన్‌లో ఆవులు, ఎద్దులు కలిపి 1.20 లక్షలు, గేదెలు 80 వేలు, గొర్రెలు, మేకలు 5.84 లక్షలు ఉన్నాయి.

టీకాలు తప్పనిసరి

పశువులకు వర్షాకాలంలో సోకే వ్యాధులను నివారించేందుకు తప్పనిసరిగా టీకాలు వేయించాలి. కొంత మంది పాల దిగుబడి తగ్గుతుందని టీకాలు వేయించడానికి వెనుకంజ వేస్తున్నారు. ఇది ఒక అపోహ మాత్రమే. టీకాల వల్ల ఎలాంటి పాల దిగుబడి తగ్గదు. వ్యాధులు ప్రబలి పశువులను కోల్పోకముందే ముందస్తుగా టీకాలు వేయిస్తే మంచిది. సరైన సమయంలో టీకాలు వేయించడం ద్వారా పశువులకు వ్యాధులు సోకకుండా నివారించవచ్చుని పశువైద్యులు సూచిస్తున్నారు.

పాడిపశువుల్లో సోకే వ్యాధులు

గాలి కుంటు వ్యాధి: సాధారణంగా ఆవులు, ఎద్దులు, గేదెలు వంటి జీవాలు ఈ వ్యాధి బారిన పడుతాయి. ఈ వ్యాధి సోకిన పశువుల్లో దాదాపు 104 నుంచి 105 డిగ్రీలకు శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. పశువుల నోట్లో, గిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. గ్రాసం సరిగా తినలేవు. దీంతో నీరసంగా మారి నడవడంలో తీవ్ర ఇబ్బందులు పడతాయి. పశువుల్లో పాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుంది. ఈ వ్యాధి నివారణ కోసం యంటిమయోటిక్స్ పెయిన్ కిల్లర్స్ మందులను వాడాల్సి ఉంటుంది.

జలగ వ్యాధి: మురుగునీరు, కాల్వల్లో నీటిని తాగడం వల్ల ఈ జలగ వ్యాధి వస్తుంది. ముఖ్యంగా గేదెలు, దూడలు, గొర్రెలు, మేకల వంటి జీవాలకు ఈ వ్యాధి సోకుతుంది. వ్యాధి సోకిన పశువులకు దవడ కింద నీరు చేరుతుంది. అలాగే పొట్ట కింద నీరు చేరే అవకాశం ఉంది. పశువులు మేత తినడంలో ఇబ్బందులు పడతాయి. పాల దిగుబడి తగ్గుతుంది. జలగ వ్యాధి బారిన పడకుండా పశువులకు డిస్టోడిన్ 4 మాత్రలు, 100 మిల్లీలీటర్ల నీయోజాడ ప్లస్‌లను అందించాలి.

నట్టల వ్యాధి: గొర్రెలు పచ్చిమేత తిన్నప్పుడు నులి పురుగుల సమస్య వస్తుంది. దీంతో గొర్రె ఎదగడానికి అవకాశం ఉండదు. రోగాల బారిన పడతాయి. వర్షాకాలంలో ఎక్కువగా గొర్రెలు ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉంటుంది. వర్షాలకు అక్కడక్కడ పచ్చి మేత పెరుగుతూ ఉంటుంది. అది తిన్నప్పుడు నులిపురుగుల వల్ల సమస్య ఉత్పన్నమవుతంది. అందుకే ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా అరు నెలలకు ఒకసారి నట్టల నివారణ మందులను ఉచితంగా అందిస్తోంది.

గొంతు వాపు వ్యాధి: పశువులకు సంక్రమించే వ్యాధులలో గొంతు వాపు వ్యాధి ప్రాణాంతకం. ఈ వ్యాధికి గురైన పశువుల కంటి నుంచి నీరు కారడం, నోటి నుంచి చొంగ కారుస్తుండడం, శ్వాస పీల్చడం ఇబ్బందిగా ఉంటుంది. గొంతు కిందకు నీరు దిగి గొంతు వాపు వస్తుంది. తీవ్రత ఎక్కువైతే పశువులు చనిపోయే ప్రమాదం ఉంది. వ్యాధి నియంత్రణకు ముఖ్యంగా జూన్, జూలై నెలల్లో (హెచ్ఎస్) టీకాలు వేయడం జరుగుతుంది. వ్యాధికి గురైన పశువులను మంద నుంచి వేరు చేయాల్సి ఉంటుంది.

చిటుకు వ్యాధి: వర్షాకాలంలో పశువులకు ఎక్కువగా చిటుకు వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వల్ల జ్వరం తీవ్రంగా ఉంటుంది. చిటుకు వ్యాధి నివారణకు జూన్, జూలై మాసాల్లో ఇటాస్ వ్యాక్సిన్ వేస్తారు. రైతులు వ్యాధులను గుర్తించి సకాలంలో వైద్యం అందించడం వల్ల పశుసంపదను కాపాడుకోవచ్చు.

ముందస్తు టీకాలు వేయిస్తే మంచిది



వర్షాలు ప్రారంభమయ్యాయి. ప్రతి పాడి రైతు పశువులకు ముందస్తుగా టీకాలు వేయిస్తే మంచిది. ఇప్పటికే పశువులు, గొర్రెలు, మేకలు, గేదెలకు టీకాలు వేశాం. ఇంకా టీకాలు వేయని పశువులు మిగిలి ఉంటే టీకాలు వేస్తాం. పశువులకు సోకే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి. ప్రస్తుతం టీకాలు వేసే కార్యక్రమం జరుగుతుంది. ఇంకా ఎవరైనా మిగిలి ఉంటే పాడి రైతులు గమనించి పశువులకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి. పశువ్యాధుల పట్ల ఏమైనా అపోహలు ఉంటే స్థానికంగా ఉన్న పశు వైద్య కేంద్రాల్లో సంప్రదించి సూచనలు పొందవచ్చు. – **పీవీ.రమణ, పశు వైద్య ఉపసంచాలకులు, ఆదోని**

ప్రశాంతంగా వేలంపాట



నాగలదిన్నెలో వేలం నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య

నందవరం: మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలో కమేళా, బండ్ల మెట్ట, వారాంతపు సంత మార్కెట్‌ను ఈఓపీఆర్డీ ఈశ్వరయ్య వేలం నిర్వహించారు. సోమవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ బోయ లక్ష్మీ ఆధ్వర్యంలో మండల అధికారుల నేతృత్వంలో వేలంపాట జరిగింది. వారాంతపు సంత మార్కెట్ రూ.52,500, కమేళా రూ.3 వేలు, బండ్ల మెట్ట రూ.79,300కు అదే గ్రామానికి చెందిన మునాఫ్ హెచ్చుపాడి హక్కులు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారం వారం రోజుల్లో వేలం పాడిన సొమ్మును పంచాయతీ ఖాతాలో జమ చేయాలని సూచించారు. ఈ వేలం కేవలం 9 నెలల 15 రోజులకు మాత్రమేనని, వేలంలో గతం కంటే ఆదాయం పెరిగిందని వివరించారు. పంచాయతీ కార్యదర్శి రామారావు, ఎంపీటీసీ అత్తవుల్లా, గ్రామస్తులు, వేలం పాటదారులు పాల్గొన్నారు.

వంకలోకి దూసుకెళ్లిన ట్రాక్టర్

తుగ్గలి: మండల పరిధిలోని గిరిగెట్ల లింగాల వంకలోకి సోమవారం ట్రాక్టర్ ఇంజిన్ దూసుకెళ్లింది. తుగ్గలికి చెందిన ట్రాక్టర్ అమినాబాద్ వైపు వెళుతుండగా మార్గమధ్యలో గిరిగెట్ల వద్ద అదుపు తప్పి వంకలో పడి పోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. జేసీబీ సాయంతో ట్రాక్టర్ ఇంజిన్‌ను బయటకు తీశారు.

• ముమ్మరంగా విత్తు పనులు



పెద్దకొత్తిలిలో కంది విత్తుతున్న రైతులు



గంగవరంలో మిరప విత్తుతున్న అన్నదాతలు

నందవరం: నైరుతి రుతుపవనాల రాకతో పుడమితల్లి పులకరించింది. తొలకరి చినుకులు కురిసిన వేళ రైతన్నలు విత్తన సాగు పనులు ముమ్మరం చేశారు. పొలాల్లో ఓ వైపు హలాల సవ్వడి.. మరో వైపు కర్షకుల సందడి నెలకొంది. ఊరూరా రైతులు కంది, పత్తి, మిరప విత్తులకు ఉపక్రమించారు. నిన్నటివరకు బోసిపోయిన పొలాలు కాడెద్దులు, కర్షకులతో దర్శనిమిస్తున్నాయి. ముందస్తు పత్తి విత్తనంతో పొలాలన్నీ సేద్యపు సవ్వడితో మురిసిపోతున్నాయి. నందవరం మండల పరిధిలోని నదీతీర గ్రామాలైన గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, పూలచింత, నందవరం తదితర గ్రామాల్లో కంది, పత్తి, మిరప విత్తుకుంటున్నారు. సకాలంలో వర్షాలు కురుస్తుడడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో దాదాపుగా 50 శాతం మంది రైతులు విత్తు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

వేరుశనగ విత్తనాలు అందుబాటులో ఉంచాలి



రైతు సంఘం తాలూకా అధ్యక్షుడు గోపాల్

కోసిగి: కోసిగి మండలంలో రైతులకు వేరుశనగ విత్తనాలను అందుబాటులో ఉంచాలని రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు గోపాల్, తాయన్న కోరారు. వారు సోమవారం మాట్లాడుతూ.. మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, రైతులు పొలాలను దుక్కి దున్ని విత్తనాలు నాటుకునేందుకు సంసిద్ధం చేసుకున్నారన్నారు. అయితే రైతులకు విత్తనాలు సరఫరా చేయకుండా అధికారులు చేతులెత్తేశారని ఆరోపించారు. చాలామంది రైతులు సబ్సిడీ వేరుశనగ విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. విత్తనాలను అందుబాటులో ఉంచి అడిగిన రైతులకు ఎకరాకు 5 బస్తాల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యయప్రయాసలు లేకుండా గ్రామాల్లోనే రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు అందించాలని కోరారు.

అనుమతి లేకుండా విత్తనాలు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ

పత్తికొండ రూరల్: అనుమతి లేకుండా రైతులకు విత్తనాలు అమ్మితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు హెచ్చరించారు. రైతులకు రశీదు ఇవ్వకుండా విత్తన ప్యాకెట్లు అమ్ముతున్నారన్న ఫిర్యాదు మేరకు సోమవారం పత్తికొండలోని లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేశారు. రూ.93వేల విలువైన విత్తన అమ్మకాలు నిలిపివేసి, షోకాజ్ నోటీసు అందించారు. విత్తన లైసెన్సు రద్దు చేయాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపించారు. ఆయన మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు విక్రయించే వారందరూ లైసెన్సు పొంది ఉండాలన్నారు. అలాగే అధిక ధరలకు ఎవరూ విక్రయించవద్దని సూచించారు.

గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు



స్కానింగ్ పరీక్షలకు పేర్లు నమోదు చేయించుకుంటున్న గర్భిణులు

ఎమ్మిగనూరురూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రికి సోమవారం పెద్ద సంఖ్యలో గర్భిణులు స్కానింగ్ పరీక్షల కోసం తరలివచ్చారు. ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ కార్యక్రమంలో భాగంగా ఎమ్మిగనూరు, మంత్రాలయం, నందవరం, పెద్దకడబూరు, కోసిగి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో గర్భిణులు ఉదయమే ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. ఒకేరోజు 472 మందికి స్కానింగ్ పరీక్షలు చేసినట్లు సూపరింటెండెంట్ డాక్టరు మైత్రేయి తెలిపారు. ఉదయం వర్షం వల్ల కొద్ది సేపు గర్భిణులు ఇబ్బందులు పడ్డారు. తర్వాత వర్షం నిలిచిపోవడంతో వైద్య పరీక్షలు కొనసాగాయి. గర్భిణుల వేచి ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేసినా వారు పెద్దసంఖ్యలో తరలిరావడంతో ఆవరణలో పూర్తిగా నిండిపోయారు. వారందరికీ ఆరోగ్య పరీక్షలు చేసి మందులు ఇచ్చి పంపారు.

– స్కానింగ్ పరీక్షల కోసం ప్రభుత్వాసుపత్రికి వచ్చిన వారికి మార్నింగ్ ఫ్రెండ్స్ సంస్థ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ప్రతి నెలా గర్భిణులు, వారితోపాటు వచ్చిన సహాయకులకు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

అండర్‌బ్రిడ్జిలో చేరిన వరద నీరు



బంటణహాలు రైల్వే అండర్ బ్రిడ్జిలో చేరిన నీరు

చిప్పగిరి: గత వారం రోజులుగా మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మండలంలోని బంటణహాలు గ్రామంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి వరద నీరు రైల్వే అండర్ బ్రిడ్జిలోకి చేరింది. రెండడుగులకు పైగా నీరు చేరడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో బంటణహాలు, గుమ్మనూరు గ్రామాల ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు చర్యలు చేపట్టి అండర్‌బ్రిడ్జిలోకి నీరు చేరకుండా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

కోసిగికి చేరిన పాఠ్య పుస్తకాలు, బ్యాగులు



కోసిగి బాలుర పాఠశాలలో ఉంచిన బ్యాగులు

కోసిగి: ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందించేందుకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు మండలానికి చేరాయి. సోమవారం కోసిగికి వచ్చిన బ్యాగులను స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో నిల్వ చేశారు. కోసిగి మండలంలో 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బా గాంధీ పాఠశాల, ఒక మోడల్ స్కూల్, 37 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 15274 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందుకుగానూ మూడు విడతలుగా 57,133 పాఠ్య పుస్తకాలు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు 67,026 నోటు పుస్తకాలు, 1 నుంచి 5వ తరగతి వరకు 7,139 బ్యాగులు మండలానికి వచ్చినట్లు తెలిపారు. పాఠశాలలు తెరిచిన వెంటనే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, బ్యాగులు విద్యార్థులకు అందజేయనున్నట్లు ఎంఈఓ–2 నాగేశప్ప తెలిపారు.

ఉప్పొంగిన వేదావతి నది



హాలహర్వి: మండలంలోని గూళ్యం గ్రామం వద్ద వేదావతి నది వరద నీటితో ఉప్పొంగుతోంది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు ఎగువన అనంతపురం జిల్లా, కర్ణాటక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు నదికి భారీ స్థాయిలో వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో గూళ్యం నుంచి వేదావతి నది అవతలి వైపు ఉన్న కర్ణాటక ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు నిలిచిపోయాయి. నది పక్కనే ఉన్న పంట పొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

టీడీపీ దాడుల నుంచి రక్షణ కల్పించండి



రక్షణ కల్పించకపోతే ఆత్మహత్యే శరణ్యం అంటూ గోడు వెళ్లబోసుకుంటున్న ఉసేనప్ప కుటుంబ సభ్యులు

ఆదోని టౌన్: ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామంలో అధికార పార్టీ నాయకులు కక్షగట్టి దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, దాడులను అరికట్టి తమకు రక్షణ కల్పించాలని లేదంటే ఆత్మహత్యే శరణ్యమని బాధితుడు ఉసేనప్ప కుటుంబసభ్యులు సోమవారం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తేవడంతో పాటు ఇస్వీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబసభ్యులు పురుగు మందు డబ్బాతో స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు చేరుకుని కన్నీళ్లతో తమ గోడు వెలిబుచ్చారు. పెద్దహరివాణంలో ఉసేనప్ప, భార్య హేమావతి, తమ్ముడు వెంకటేష్, కుమార్తె రాజేశ్వరి, తల్లిదండ్రులు ఉసేనమ్మ, రామన్నపై జరిగిన దాడిని ఇస్వీ పోలీసుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. తమ ఇంటి ముందు ఉన్న రస్తాను టీడీపీ నాయకులు చిన్నగాది లింగ, అతని కుమారుడు అనిల్‌కుమార్ దౌర్జన్యంగా అక్రమించుకుని తాము రాకపోకలు సాగించకుండా అడ్డుపడుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఇదేమి అన్యాయమని అడిగితే తాము చెప్పినట్లుగా వినాలని, లేదంటే ఊరు విడిచి వెళ్లిపోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తూ దాడికి పాల్పడుతున్నారని తెలిపారు. ఎవరికైనా చెప్పుకో తమకేమీ భయం లేదంటూ ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారని, మహిళలని చూడకుండా దుర్భాషలాడుతూ దాడులు చేశారని బాధితుడు ఉసేనప్ప రోధిస్తూ తెలిపారు. తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో కుటుంబం మొత్తం పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని ఉసేనప్ప కన్నీరు మున్నీరుగా విలపించాడు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి

ఆదోని టౌన్: వర్షాకాలం ప్రారంభమైంది. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి సూచించారు. సోమవారం స్థానిక వైద్య ఆరోగ్య శాఖ డివిజన్ కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆదోని డివిజన్‌లో పురుషులు, చిన్నారులు, మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. విరేచనాలు, వాంతులు, మలేరియా, డెంగ్యూ, క్షయవ్యాధి పట్ల పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకునేలా వైద్య సిబ్బంది చూడాలని ఆదేశించారు. వర్షాకాలం కావడం వల్ల పొలాలు, గుంతల్లో ఎక్కడపడితే అక్కడ నిలిచిన వర్షపు నీటిని తాగరాదని సూచించారు. శుద్ధి చేసిన నీటినే తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. సంపూర్ణ పోషకాహారం తీసుకోవడం మంచిదన్నారు. హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య సిబ్బంది, సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, ఇందిరాదేవి తదితరులు పాల్గొన్నారు.

• తుంగభద్రమ్మకు జలకళ

నందవరం: వర్షాలు ఆశాజనకంగా కురుస్తుండడంతో తుంగభద్రమ్మ జలకళను సంతరించుకుంది. కర్నూలు జిల్లాలో ఎగువన హొళగుంద, కోసిగి, హాలహర్వి, మంత్రాలయం తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు తుంగభద్రమ్మ కళకళలాడుతుంది. నిన్నటివరకు బోసిపోయిన తుంగభద్రమ్మ నేడు వానల రాకతో నీటి ప్రవహంతో కనువిందు చేస్తుంది. సరైన వర్షాలు సమయానికి కురవడంతో నది తీర ప్రాంత రైతులకు సాగు నీరు దరిచేరింది. నదిలో వరద నీరు ప్రవహించడంతో వరి సాగుకు అనువుగా మారనుంది. దీంతో రైతులు వరిమడులు సిద్ధం చేసుకుంటున్నారు. నదితీర ప్రాంతాలైన నదికైరవాడి, గంగవరం, జొహరాపురం, పెద్దకొత్తిలి, చిన్నకొత్తిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాలలో వరి సాగు ఊపందుకుంటుంది.



నాగలదిన్నె బ్రిడ్జి వద్ద నదిలో ప్రవహిస్తున్న వరద నీరు

• వర్షం.. హర్షం



హొళగుంద శివారులో వర్షం కురుస్తున్న దృశ్యం

హొళగుంద: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సోమవారం విస్తారంగా వర్షాలు కురిశాయి. కొద్ది రోజులుగా అడపాదడపా కురుస్తున్న వర్షాల కారణంగా రైతులు సాగు చేసిన పత్తి ఇతర పంటలు పచ్చదనం సంతరించుకుని కళకళలాడుతున్నాయి. ఆయా గ్రామాలలో చెరువులకు పెద్ద ఎత్తున నీరు చేరుతోంది. వేదావతి (హగరి) నది కూడా వరద నీటితో కళకళలాడుతుంది. ఏదేమైనా గతేడాది వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయి ఉక్కిరిబిక్కిరి అయిన రైతులు ఈ ఏడాది రుతుపవనాల రాకతో సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.